# కనబడుట లేదు



మల్లాది వెంకట కృష్ణమూర్తి

ప్రయివేట్ డిటెక్టివ్ ఏకదంతం తన బల్లముందు కూర్చున్న వ్యక్తివంక చూశాడు. ఆవిడ వయసు నలభై ఆరు దాకా వుంటుంది. ఆదుర్దాగా వుంది.

"చెప్పండి. నేనే ఏకదంతాన్ని."

గొంతు సద్దుకుని చెప్పింది ఆవిడ.

"నా పేరు సారిణి. మా ఆయన కనబడటం లేదు."

"ఎప్పటినించి? ఆయన పేరు?"

"పోతరాజు. వారం క్రితం చామదుంపలు కొనడానికని మార్కెట్ కెళ్ళినాయన ఇంతదాకా తిరిగి రాలేదు."

"ఓష్ దాందేముంది? బంగాళాదుంపలు వండుకోండి." చెప్పాడు ఏకదంతం సీరియస్‌గా.

ఆవిడ తెల్లబోయి చూడటం గమనించి చెప్పాడు నవ్వుతూ—

"వెయ్యిమూలుగులకంటె ఓ చిరునవ్వు మేలు....మీ ఇద్దరికీ అభిప్రాయభేదాలేమైనా వున్నాయా?"

"లేవు."

"మీ వయసెంత?"

"ముప్పై ఆరు."

ఆవిడకు కొందరు ఆడవాళ్ళలా వయసు దాచే జబ్బుందని గ్రహించి చెప్పాడు!

"ముప్పై మీద కొన్ని నెలలన్నమాట. మీ ఆయనే వృత్తి. అలవాట్లు. వెంట ఏం తీసుకెళ్ళారు. స్నేహితులెవరు. ఏం బట్ట లేసుకున్నారు మొదలైన వివరాలు కావాలి. ఒకటొకటే అడుగుతాను, చెప్పండి. ఫొటో కూడా కావాలి" చెప్పాడు ఏకదంతం తన నోట్ బుక్ అందుకుని.

అరగంట తర్వాత పోతరాజు చామదుంపలు కొనడానికి వెళ్ళిన కూరల దుకాణానికి వెళ్ళాడు. పోతరాజు ఫొటో చూపి గుర్తుపట్టాడు కూరలు అమ్మే అతను. చామదుంపలు కొనలేదని చెప్పాడు.

ఏకదంతం పోతరాజు మాయమవడానికి కారణం కనుక్కోవాలనుకుని అతని మిత్రులందరినీ కలిశాడు. ఆయనకి ఎలాంటి చెడు అలవాట్లు లేవు. ఆఫీస్‌లో డబ్బు దొంగతనం చేయలేదు. ప్రేయసి అసలే లేదు. అప్పుల్లో లేడు. దీర్ఘ వ్యాధులేం లేవు. శత్రువులు లేరు. ఏ ఆడపిల్ల దగ్గరా ఎలాంటి పొరబాటు చేయలేదు. ఆయన మాయం అవడానికి కారణం తెలియలేదు.

పోతరాజు కార్టూన్స్ గీస్తాడని తేలింది. అతను అదృశ్యం అవడానికి ఏదయినా క్లూ దొరుకుతుందేమోనని అతను వేసిన కార్టూన్స్ అన్నీ పరిశీలించాడు.

ఆ వారంలో పోతరాజుకి పత్రికల నించి మనీఆర్డరేమైనా వచ్చాయేమోనని తనిఖీ చేశాడు పోస్టాఫీసులో.

వచ్చాయి.

పోస్ట్‌మేన్ వాటిని హైదరాబాద్‌లోని ఓ చిరునామాకి రీ-డైరెక్ట్ చేశాడు. సరాసరి ఆ చిరునామాకి వెళ్ళాడు.

పోతరాజు ఆ ఇంట్లో ఒంటరిగా జీవిస్తున్నాడు ఏకదంతం తనని పరిచయం చేసుకుని అడిగాడు.

"మీరు నా వెంట మీ ఆవిడ దగ్గరకి రావాలి."

"దేమిట్ అది నన్నిలా వెదికిస్తుందనుకోలేదు" బాధగా చెప్పాడు. "అది పరమ గయ్యాళి. 'నేను జగమొండిని' అని అదే గర్వంగా చెప్పుకుంటుంది. ఆ రోజు కూరల మార్కెట్‌లో కూరలమ్మే ఓరాక్షసి దాని మొగుడు పోట్లాడుకోవటం చూశాను. క్షణాల్లో వాళ్ళిద్దరూ విడిపోయారు. నా కళ్ళముందే మరో దుకాణం పెట్టుకుని సంతోషంగా వున్నవాడిని చూశాక ఇక ఇంటికి తిరిగి వెళ్ళాలనిపించలేదు. దయచేసి నావునికి తెలియచెయ్యకండి."

ఆ సాయంత్రం సారిణితో చెప్పాడు ఏకదంతం. "పోతరాజు ఎవర్నో లేవదీసుకుని శ్రీలంక పారిపోయాడు. గుడ్‌లక్ అండ్ గుడ్‌బై."

# పాకిస్తాన్‌లో పది నిముషాలు

ఓ మిత్రుడు ఈ మధ్య పాకిస్తాన్‌లో పది నిముషాలు ఉండి వచ్చానన్నాడు. అతడి కథనం. అనూప్‌గడ్ నించి రోడ్డు పాయింట్‌తో ప్రారంభించి 15 కిలోమీటర్లు ఇసుకపర్రల గుండా వెళ్తే పాకిస్తాన్ సరిహద్దు. ఓ ఇరవై మంది బృందం కార్లు వెళ్ళని ఇసుక పర్రలగుండా. జీపులు అరడుగులోతు ఇసుకని తొలిచేస్తూ ముందుకు పోతుంటే ఆత్రంగా చేరాం బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ చెకపోస్ట్ దగ్గరకు.

బి.యస్.యఫ్. మేజరు వాళ్ళ లారీలో భారత పాకిస్తాన్ సరిహద్దు స్తంభం దగ్గరకు తీసికెళ్ళాడు. అడుగు దాటితే పాకిస్తానం అడుగు ఇవతల భారతదేశం. మధ్యన స్తంభం. ఫరిద్‌సర్ చౌకీ. స్తంభానికి ఇటుపక్క ఇండియా 351 అని చెక్కి వుంది. అటుపక్క పాకిస్తాన్ 351. అడుగు మేరలో చీలిపోయిన రెండు దేశాలు. పాకిస్తాన్ పొలాల్లో పనిచేస్తున్న కూలీలు మమ్మల్ని చూసి బెదిరిపోయారు. వాళ్లని ఎత్తుకుపోతారని భయంట.

నా మిత్రుడు మేజర్ సాయం చేస్తే పాకిస్తాన్ పొలాల్లో పనిచేసే వాళ్లతో పది నిమిషాలు మాట్లాడి వస్తానన్నాట్ట. అవతలి దేశంలో అడుగుపెట్టటం అపరాధం. కూడదని మేజర్ వారించాట్ట. ఇండియావైపు పొలాల్లో పనిచేస్తున్న కూలీల్ని కొన్ని ప్రశ్నలు వేశాడు. "మీరంతా పక్కపక్కనే పనిచేస్తుంటారు కదా! రోజూ కలిసికట్టుగా మాట్లాడుకుంటారా? బువ్వ మూటలు కలుపుకు తింటారా? మంచి చెడూ కలబోసుకుంటారా?" కూలీల నుంచి విచిత్రమైన సమాధానం వచ్చింది. "అన్నం కలుపుకు తింటం దేవుడెరుగు—మాట పలుకు కూడా నిషిద్ధం" అని. కారణం—మాటలు సాగిస్తే ఏదన్నా రహస్య సమాచారం అందిస్తున్నారేమోనని రెండు దేశాల పహరావాళ్ళు అనుమానిస్తారట.

ఎంతటి సామీప్యం!

ఎంతటి అడ్డుగోడ!

మిత్రుడు పాకిస్తానంలో పది నిమిషాలు వారి పత్తి పొలాల్లో తిరిగి తిరిగి గుర్తుగా పట్టెడు విచ్చుకున్న పత్తిపూలు తెచ్చుకున్నాడు.

ఆ తెల్లటి పత్తి గుత్తులు చూస్తుంటే అనిపించింది భారత. పాక్ పౌరుల మధ్య స్నేహవస్త్రం చిక్కగా ఎన్నడు అల్లికొనునో—అని.

—సత్యం శంకరమంచి